

పేదల గుండెల్లో బీఆర్‌ఎస్

పేద ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్ పార్టీ పదిలంగా ఉందని రాష్ట్ర క్రీడలు, టూరిజం శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 6లో



ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జేపీఎస్‌ల సమ్మె నేపథ్యంలో పంచాయతీల్లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. 6లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా శ్రీబాలాజీ కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆ తర్వాత అర్చకులు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు ఈ వేడుకను తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

కార్మికులకు రేపు ఉచిత ఆరోగ్య పరీక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కార్మిక శాఖలో గుర్తింపు కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికులందరికీ మేడే సందర్భంగా సోమ, మంగళ, బుధవారాల్లో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కార్మిక శాఖాధికారులను ఆదేశించారు. కార్మిక శాఖ, కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్యాంపుల్లో 50 రకాలకు పైగా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో మొదటి విడత మూడు కేంద్రాల్లోనే పరీక్షలు ఉంటాయని, మే 1, 2 తేదీల్లో బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్ పంచాయతీ కార్యాలయంలో, 3న ఉప్పుసాకలో ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని వివరించారు. మిగిలిన మండలాల్లో ఆ తర్వాత క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 82475 83686, 99852 34236 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేరస్తులకు శిక్షపడేలా చూడాలి

- ఎస్పీ డాక్టర్ వినీత్



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: నేరస్తులకు శిక్షపడేలా ప్రతి పోలీసు బాధ్యతగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల వివరాలను ఆయా స్టేషన్‌ల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సామాన్యులకు ఇబ్బంది కలిగేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి రవాణా, గుట్కా, మట్కా వంటి అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై నిఘా పెంచాలని, చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షీ టీమ్స్ ఆవశ్యకతపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని అన్ని స్టేషన్లనూ సందర్శిస్తుండాలని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, డీఎస్పీలు రమణమూర్తి, వెంకటేష్, రాఘవేంద్రరావు, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కరోనా కేసులు నమోదు

చుంచుపల్లి: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల పరిధిలో శనివారం నిర్వహించిన కోవిడ్ పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష తెలిపారు. మొత్తం 201 మందికి వైద్య పరీక్షలు చేయగా ఇద్దరికి కరోనా లక్షణాలు కనిపించాయని పేర్కొన్నారు.

పంజరంలో చేప!

సాధారణంగా చెరువులు, నదులు.. ఇలా జలాశయాల్లో చేపలను పెంచుతారు. ఏటా వర్షాకాలంలో పిల్లలను వదలడం.. ఏడు, ఎనిమిది నెలల తర్వాత వలలు వేసి చేపలు పట్టడం మనందరికీ తెలిసిందే. కానీ ఇక్కడ మాత్రం పంజరంలో చేపలు పెంచుతారు! ఇదేమిటని అనుకుంటున్నారా? ఔను నిజమే.. కేజ్ కల్చర్‌గా పిలిచే ఈ విధానం ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌లో తొమ్మిదేళ్లుగా విజయవంతంగా సాగుతోంది.

– సాక్షి, ఖమ్మం డెస్క్

పాలేరులో విజయవంతంగా 'కేజ్ కల్చర్'

- 9 ఏళ్ల క్రితం రిజర్వాయర్‌లో యూనిట్లు ప్రారంభం
- రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 'సక్సెస్'
- వంద మందికి పైగా మత్స్యకారులకు ఉపాధి



పాలేరు రిజర్వాయర్‌లోని కేజ్ కల్చర్ యూనిట్ (ఇన్‌సెట్) మత్స్యకారులు పట్టిన చేపలు

జార్ఖండ్ రాష్ట్రంలోని చండిల్ రిజర్వాయర్ వద్ద కేజ్ కల్చర్ విధానం సక్సెస్ కావడంతో తెలంగాణలోనూ అమలుకు 2014లో ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌తో పాటు కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాలను ఎంపిక చేసింది. తొలిదశలో నిజామాబాద్ జిల్లా పోచంపాడు రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ మొదలుపెట్టారు. ఆ తర్వాత పాలేరు రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్‌ను అప్పటి వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.



ఏమిటీ విధానం

సాధారణంగా జలాశయాల్లో చేపపిల్లలు వదిలి అవి పెరిగాక మత్స్యకారులు పట్టి అమ్ముకుంటారు. అయితే, నీరు బయటకు వెళ్లే క్రమంలో చేపపిల్లలు కూడా వెళ్లిపోతాయి. అలాగే, చేపలకు వైరస్ సోకినా మందులు వేసేందుకు, దాణా వేయాలన్నా ఇబ్బందులు వస్తాయి. ఇక చేపలు పట్టే క్రమంలోనూ చెరువంతా గాలించాల్సి వస్తుంది. కానీ కేజ్ కల్చర్ విధానంలో అంతా భిన్నంగా ఉంటుంది. నీటిలో తేలే గుణం ఉన్న ప్లాస్టిక్ డబ్బాలను ఒక దానికొకటి అమరుస్తారు. ఆపై యూనిట్ చుట్టూ(వెలుపల) లావు తాళ్లతో బిగించి, కింద కూడా లోతు వరకు వలలు బిగిస్తారు. ఫలితంగా మత్స్యకారులు వదిలే చేపపిల్లలు యూనిట్ పరిధిలోనే తిరుగుతుండడంతో దాణా వేయడం, వైరస్ సోకితే మందులు ఇవ్వడం సులభమవుతుంది. అంతేకాక ఎప్పటికప్పుడు సైజ్ చూసుకుంటూ వల వేసి పట్టడం కూడా ఈజీగా పూర్తవుతుంది. ఒకమాటలో చెప్పాలంటే పొలంలో పంటను చూసుకున్నట్లు ఇక్కడ చేపలను ఎప్పటికప్పుడు పరిశీలించొచ్చు.

పది యూనిట్లు.. 100 మంది

పాలేరు రిజర్వాయర్‌కు తొలి దశలో పది కేజ్ కల్చర్ యూనిట్లు మంజూరు చేశారు. ఆ తర్వాత ఎంపిక చేసిన పది మంది మత్స్యకారులను జార్ఖండ్ రాష్ట్రంలోని చండిల్ రిజర్వాయర్ వద్దకు పంపించి శిక్షణ ఇప్పించారు. వీరు ఇక్కడ మరో 90 మందికి శిక్షణ ఇవ్వడంతో ఈ యూనిట్ల ద్వారా 100 మంది లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఒక్కో యూనిట్ ఖరీదు రూ.30 లక్షలు ఉండగా.. ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం కింద ఈ యూనిట్లను మత్స్యకారులు నిర్వహిస్తున్నారు. వీరు 20 శాతం వాటా ధనంగా వెచ్చించారు.



యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఎనిమిది నెలల పంట

కేజ్ కల్చర్ యూనిట్లలో సహజంగా పంగాసియాస్ (నల్లజెల్ల, పెద్ద జల్లలు, తెల్ల చేపలు) చేపలను పెంచుతారు. ఈ రకం చేపలు పెంపుడు కుక్కలు, పిల్లుల మాదిరే నిర్దేశిత ప్రాంతాన్ని దాటి బయటకు వెళ్లవు. మూడు అంగుళాల పిల్లలు పోస్తే ఎనిమిది నెలల కాలంలో ఒక్కో చేప కిలో నుంచి కిలోన్నర బరువు పెరుగుతుంది. చేప ఒక కిలో పెరగడానికి మత్స్యకారులకు దాణా, ఇతర ఖర్చులు కలిపి రూ.50 అయితే.. రూ.120 నుంచి రూ.150 వరకు అమ్ముకున్నా యాభై శాతానికి పైగా లాభం సమకూరుతుంది. ఒక యూనిట్ పరిధిలో 4 నుంచి 5 టన్నుల మేర దిగుబడి వస్తుండడంతో సీజన్‌లో ఒక్కో మత్స్యకారుడికి సుమారు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా.

మాకూ కావాలి..

పాలేరు కేజ్ కల్చర్ విధానం విజయవంతం కావడంతో పలువురు మత్స్యకారులు తమకు కూడా మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న కేజ్ కల్చర్ నిర్వాహకులు వలలు, ఇతర పరికరాలను సబ్సిడీపై అందించాలని కోరుతున్నారు. కాగా, కరోనా ముందు మాదిరి కేజ్ కల్చర్ చేపలను వ్యాపారులు విదేశాలకు ఎగుమతి చేస్తే డిమాండ్ మరింత పెరుగుతుందని చెబుతున్నారు.

వ్యవసాయం మాదిరే ఇది..



వ్యవసాయ భూమికి కేజ్ కల్చర్‌కు పోలిక ఉంది. వ్యవసాయ భూమిలో పంట మాదిరే కేజ్ కల్చర్‌లో చేపల పంట వస్తుంది. ఏటా మత్స్యకారులకు పంట చేతికొచ్చినట్లే. ఈ విదానం సత్ఫలితాలను ఇవ్వడంతో మరికొందరు మత్స్యకారులు దరఖాస్తు చేసుకున్నారు. పాలేరు రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ విజయవంతమైంది.

– దేశబోయిన ఏడుకొండలు, నాయకన్‌గూడెం

మంచి ఫలితాలు వస్తున్నాయి..



రాష్ట్రంలో ఎక్కడా లేనట్లుగా కేజ్ కల్చర్ విధానం పాలేరు రిజర్వాయర్‌లో మంచి ఫలితాలు ఇస్తోంది. వంద మంది మత్స్యకారులు చేపల పెంపకం చేపడుతున్నారు. ఈ విధానంలో కోళ్ల పెంపకం మాదిరే దాణాకు ఖర్చవుతుంది. లాభాలు యాభై శాతానికి పైగా ఉంటాయి. పలువురు కేజ్ కల్చర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తి



రామాలయంలో కుటుంబసభ్యులతో జడ్జి వసంత్

భద్రాచలం/భద్రాచలంఅర్బన్/పాల్వంచరూరల్/కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వసంతరావు పాటిల్ శనివారం భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అంతరాలయంలోని మూలమూర్తులను, ఉపాలయాల్లో లక్ష్మీదేవి అమ్మవారిని, అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో..

పాల్వంచ మండలంలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారిని జిల్లా జడ్జి వసంతరావు పాటిల్ దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు వారికి స్వాగతం పలికి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చైర్మన్ మహిపతి రామలింగం అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందించారు.

ఘన సత్కారం..

భద్రాచలం వచ్చిన సందర్భంగా న్యాయమూర్తిని జ్యుడీషియల్ ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ నీలిమ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం భద్రాచలం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జడ్జిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోట దేవదానం, న్యాయవాదులు ఎం.వి. రమణారావు, కొడాలి శ్రీనివాసన్, నందూరి శ్రీనివాస్, టి.వసంతారావు, పేరాల నాగరాజు, చీమల నరసింహారావు, పులుసు తరుణి, మహేశ్వరావు, రాంబాబు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన ఈఎస్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్‌రావు పాటిల్‌ను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.జానయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంకా సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎస్కే రహమాన్ అలీ, సీఐలు ఆర్.వెంకటేశ్వర్లు, ఎల్.రాజు, అబ్బయ్య, రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, తిరుపతి, సుమన్, గణేష్, విజయలక్ష్మి, రాజేందర్ కూడా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

3 నుంచి యోగానంద నరసింహస్వామి తిరుకల్యాణోత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణానికి హాజరైన భక్తులు

3 నుంచి తిరుకల్యాణోత్సవాలు..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో మే 3 నుంచి 8 వరకు తిరుకల్యాణోత్సవాలు జరగనున్నాయి. 3న వాస్తు పూజ, మృత్సంగ్రహణం, ఉత్సవాలకు అంకురార్పణ, 4న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, ఎదుర్కోలు, 5న స్వామి వారి తిరుకల్యాణోత్సవం, 6న చతుఃస్థానార్చన, రథోత్సవం, 7న పూర్ణాహుతి, 8న తెప్పోత్సవం, దొంగల దోపు, పుష్పయాగాలతో ఉత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.

చట్టాలతో మహిళలకు రక్షణ

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంటౌన్: గృహహింస నిరోధక చట్టం మహిళలకు రక్షణ కవచం వంటిదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. శనివారం స్థానిక రైటర్‌బస్తీలోని న్యాక్ సెంటర్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భర్త, అత్తామామల వేధింపులతో బాధపడే మహిళలకు గృహహింస నిరోధక చట్టం అండగా నిలుస్తుందని అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయసహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, కొత్తగూడెం బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కాసాని రమేష్, ట్రెజరర్ సంతోష్ సాహూ, మెండు రాజమల్లు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జ్యోతివిశ్వకర్మ, నాగ స్రవంతి, న్యాక్ సెంటర్ నిర్వాహకురాలు బేబి, న్యాయవాదులు లక్ష్మి, సరిత, రమేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీతారాం వెల్లడి

కొత్తగూడెంటౌన్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం తెలిపారు. తన కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల లోపు వారికి ప్రతి రోజు ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. శిక్షణలో పాల్గొనే బాలబాలికలు ఆదివారం వరకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. చిన్నారులను నైపుణ్యం గల క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 12 శిబిరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో యోగా, త్రీ ఇంక్లైన్ గ్రౌండ్‌లో రెజ్లింగ్, సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో హాకీ, జయశంకర్ మైదానంలో అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు. అశ్వాపురం జెడ్పీ హైస్కూల్‌లో కరాటే, దమ్మపేట టీటీడబ్ల్యూ స్కూల్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్, ఇల్లెందు రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి

జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకటేశ్వర్లు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఓ వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలని, ధాన్యంలో తేమశాతం 17శాతం కంటే ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి(డీసీఓ) ఎస్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మండల పరిధిలోని సోములగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. రైతులు కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ బాగా ఆరిన ధాన్యాన్ని మాత్రమే విక్రయించాలని చెప్పారు. అమ్మకానికి తెచ్చిన ధాన్యంలో తాలు గింజలు, మట్టి, రాళ్లు లేకుండా శుభ్రం చేయాలని, గ్రేడింగ్ చేసిన ధాన్యాన్ని మాత్రమే కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట పాల్వంచ సొసైటీ కార్యదర్శి శ్రీను ఉన్నారు.

పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ సుకృత

పాల్వంచరూరల్: మండల పరిధిలోని ఉల్వనూరు గిరిజన ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించిన తర్వాత మాట్లాడుతూ.. ఆస్పత్రి పరిధిలోని మహిళలకు, ముఖ్యంగా గుత్తికోయ మహిళలకు పీహెచ్‌సీలోనే ప్రసవాలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎస్‌సీడీ మణికంఠారెడ్డి ఉన్నారు.

సేవా లోపంపై రూ.50 వేల జరిమానా

ఖమ్మంలీగల్: బ్యాంకు రుణం తీసుకుని సకాలంలో డబ్బు చెల్లించినా ఇంటి పత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిన బ్యాంకుకు రూ.50 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం వినియోదారుల కమిషన్ శనివారం తీర్పు చెప్పింది. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన బొల్లి ఉపేంద్ర 2004లో తన ఇంటిని తాకట్టు పెట్టి బ్యాంక్ నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాడు. అయితే, ఇంటి పత్రాలు అడగ్గా బ్యాంక్ అధికారులు స్పందించకపోవడంతో న్యాయవాది నరేంద్ర స్వరూప్ ద్వారా జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశాడు. విచారించిన కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత బ్యాంక్ సేవాలోపాన్ని నిర్ధారిస్తూ రూ.50 వేల జరిమానా విధించడమే కాక కేసు ఖర్చుల కింద మరో రూ.5 వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

కిడ్నాప్ కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన బాలుడు కిడ్నాప్‌కు గురైన సంఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... సీతారాంపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు గుడపాటి భార్గవ్‌కృష్ణను వరుసకు తాతయ్య అయిన గుడపాటి పుల్లారావు ఈ నెల 16న కిడ్నాప్ చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం పాలచర్లకు చెందిన పుల్లారావు బాలుడిని బలవంతంగా, తల్లి అనుమతి లేకుండా తీసుకెళ్లాడు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఎస్‌బీఐ పేరుతో నగదు స్వాహా

అశ్వారావుపేటరూరల్: ఓ ఖాతాదారుడిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి డబ్బులు కాజేసిన ఘటన శనివారం జరిగింది. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నారంవారిగూడేనికి చెందిన సుభానికి గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు తాము ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి, తక్షణమే ఎనీ డెస్క్ అప్లికేషన్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. సదరు అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న కొద్ది సేపట్లోనే సుభాని బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.14,630 నిందితులు డ్రా చేసి కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒడిశా వాసి అదృశ్యం

పాల్వంచరూరల్: అల్లుడిని చూసేందుకు వచ్చిన వ్యక్తి అదృశ్యంకాగా, శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రంలోని మయూర్ బంజ్ జిల్లా గోడ్‌పాల్ మండలం బదలావ్‌కందా గ్రామానికి చెందిన మహేంద్ర నాయక్(53) ఈ నెల 21న తోగ్గూడెం గ్రామంలో ఉన్న తన అల్లుడు అమీరునాయక్ ఇంటికి వచ్చాడు. 22న అదృశ్యమయ్యాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. అమీరునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పంచాయతీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- రెండో రోజుకు చేరిన జేపీఎస్‌ల సమ్మె
- ఇతర అధికారులు, సిబ్బందికి విధుల కేటాయింపు!



కొమరారం గ్రామం వ్యూ

ఇల్లెందురూరల్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. కాగా పంచాయతీల్లో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. కానీ సమ్మె బాటలో ఉన్న జేపీఎస్‌ల విజ్ఞప్తి మేరకు అదనపు బాధ్యతలు స్వీకరించేందుకు వారు విముఖత చూపారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారులు మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, సెర్ప్ ఏపీఎం, సీసీలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీల్లో సీనియర్ కారోబార్‌లకు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలను అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. విభాగాల వారీగా ఆసక్తి ఉన్న వారి జాబితాను సిద్ధం చేసి, సోమవారం నుంచి అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. గ్రామపంచాయతీల్లో రోజువారీగా చేపట్టే పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ, మొక్కలకు నీళ్లు పట్టడం, నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణ, గ్రామపంచాయతీ సాధారణ విధులు యథావిధిగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా 354 మంది జేపీఎస్‌లు సమ్మెలో ఉన్నారు. వీరిలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తికాని 92 మంది సమ్మెలో కొనసాగొద్దంటూ జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి సమాచారం ఇవ్వడంతో.. వారు కొంత సందిగ్ధంలో పడ్డారు.

ఉద్యమం ఆగదు

ఎవరికీ లేని నాలుగేళ్ల ప్రొబేషనరీ గడువు మాకు విధించారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. ప్రొబేషనరీ కాలం పూర్తి కాని 92 మంది జేపీఎస్‌లు కూడా సమ్మెలోనే కొనసాగుతారు. వారికి టర్మినేషన్ ఆదేశాలు జారీ చేసినా వెనుకాడేదిలేదు.

–వంశీకృష్ణ, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా..

జిల్లా వ్యాప్తంగా విధులకు దూరంగా ఉన్న జేపీఎస్‌ల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఇతర శాఖల అధికారులకు గ్రామపంచాయతీ బాధ్యతలు అప్పగిస్తున్నాం. ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి విధులు కేటాయిస్తాం.

–లక్ష్మీరమాకాంత్, డీపీఓ

నేను చేరే పార్టీనే అధికారంలోకి వస్తుంది..

- నాకు, నా అనుచరులకు ఏం జరిగినా సీఎందే బాధ్యత
- గులాబీ కండువా కప్పుకున్న రైతులకే నష్టపరిహారం ఇస్తారా ?
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి

టేకులపల్లి: త్వరలో మేము చేరబోయే పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఎవరినీ వదిలేది లేదని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. టేకులపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పొంగులేటి శ్రీనన్న, కోరం కనకయ్యల క్యాంపు కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం విలేకరులతోనూ మాట్లాడారు. తనను నమ్ముకున్న కార్యకర్తలను, నాయకులను ఇబ్బందులు పెడుతున్నవారికి తగిన గుణపాఠం చెప్పి తీరుతామని అన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల అరాచకాలకు భయపడేది లేదని, గుండా రాజ్యాన్ని నడవనీయబోమని, అధికార పార్టీ నాయకులకు పోలీసులు తొత్తుగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఐదారు నెలల్లో తమ సత్తా ఏమిటో తెలుస్తుందని చెప్పారు. మీ పార్టీలో లేమని చెప్పి సెక్యూరిటీ తగ్గించారని, తనకు, తన అనచరులకు ఏదైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం కేసీఆర్, డీజీపీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాల ఎస్పీలు బాధ్యత వహించాలని అన్నారు.

పరిహారం ఇవ్వకుండా జాప్యం..

అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. పింక్ కలర్ కప్పుకున్న రైతులకు మాత్రమే నష్టపరిహారం ఇస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్నే ఉద్ధరించలేదని సీఎం పార్టీ పేరు మార్చి దేశాన్ని ఉద్ధరించడానికి బయలుదేరారని ఎద్దేవా చేశారు. తొలుత నాయకులు, ప్రజాప్రతినిధులు పొంగులేటికి ఘన స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. అనంతరం మండలంలోని టేకులపల్లి, శాంతినగర్, చుక్కాలబోడు, కుంటల్ల, రామచంద్రునిపేట, బోడు, బోడుకొత్తగూడెం, కొప్పురాయి, ఒడ్డుగూడెం, బర్లగూడెం, జంగాలపల్లి తదితర గ్రామాల్లో పొంగులేటి పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆర్థికసాయం అందించారు. పలు శుభకార్యాల్లోనూ పాల్గొన్నారు. టేకులపల్లి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, తెల్లం వెంకట్రావు, ఝాన్సీ, పూనెం సురేందర్, పూనెం ఉమ, నిరోషా, సరోజిని, మంగీలాల్, మల్లిబాబు, చందర్‌సింగ్, ప్రసాద్, పోశాలు, భద్రు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



నవ్యశ్రీ



సందీప్



శ్రావణ్‌కుమార్

ఇల్లెందు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తాచాటారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. ఎంపీసీ విద్యార్థిని అనుముల నవ్య శ్రీ 83.43 శాతం, పచ్చిపాల సందీప్ 73.2శాతం, ఎస్.శ్రావణ్‌కుమార్ 52శాతం మార్కులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం హర్షం

కొత్తగూడెంఅర్బన్: సీనియర్ వ్యాయామ నిర్దేశకులకు జిల్లా క్రీడాధికారిగా అదనపు బాధ్యతలు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు బొల్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు బట్టు ప్రేంకుమార్, స్టెల్లా శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పది జిల్లాలు, ఆ తర్వాత 33 జిల్లాలుగా ఏర్పడి నప్పటి నుంచి ఇప్పటివరకు 80 శాతం జిల్లాల్లో పూర్తి స్థాయి క్రీడాధికారులను నియమించలేదని పేర్కొన్నారు. జిల్లాల్లో సైతం క్రీడా విభాగం నుంచి కాకుండా ఇతర విభాగాల జిల్లా అధికారులను జిల్లా క్రీడాధికారిగా నియమిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియకు స్వస్తి చెప్పాలని రాష్ట్ర యువజన క్రీడా విభాగం ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. సీనియర్ వ్యాయామ నిర్దేశకులకు బాధ్యతలు అప్పగించడం వల్ల క్రీడా పోటీల నిర్వహణ సైతం పకడ్బందీగా ఉంటుందని వివరించారు.

‘దళితబంధు’ కాజేశారు!

బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు మంజూరైన దళితబంధు పథకం నగదు స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇద్దరు కాజేశారంటూ బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు దాసం నాగరత్నంకు గతేడాది జూలైలో దళితబంధు పథకంలో రూ.10 లక్షలు మంజూరయ్యాయి. కాగా అశ్వారావుపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకుడు మోటూరి మోహన్, నారంవారిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఆవుల చిన్ని కలిసి లబ్ధిదారురాలికి కోళ్ల ఫారం షెడ్డు నిర్మించి, బోరు వేసి మోటారు ఏర్పాటు చేసి అప్పగిస్తామని చెప్పారు. ఆ తర్వాత షెడ్డు, బోరు, మోటారు కోసం ఆమె బ్యాంక్ ఖాతాలో ఉన్న దళితబంధు నగదు నుంచి పలు విడతల్లో సుమారు రూ.3.63లక్షలు స్థానిక లేపాక్షి ఐరన్ షాపు యజమాని బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయించారు. చివరికి తానే రూ.3.50 లక్షలు చెల్లిస్తే షెడ్డు అప్పగిస్తామని చెబుతున్నారంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా ఈ ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు.

టిప్పర్ ఢీకొని రెండు గొర్రెలు మృతి

టేకులపల్లి: బొగ్గు టిప్పర్ ఢీకొని రెండు గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. మంగలితండా గ్రామానికి చెందిన లకావత్ గణేష్‌కు సంబంధించిన మూడు గొర్రెలు మంగలితండా క్రాస్‌రోడ్డు సమీపంలోని రోడ్డు వెంబడి మేస్తున్నాయి. ఈ క్రమంలో కేటీపీఎస్ నుంచి బొగ్గు లోడుతో వస్తున్న టిప్పర్ అదుపు తప్పి గొర్రెలను ఢీకొట్టింది. దీంతో రెండు గొర్రెలు మృతి చెందాయి.

పేద ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్

- రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- వెంకటాపురం ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగం
- గంగారంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ
- హాజరైన ఎంపీలు పార్థసారధిరెడ్డి, నామా నాగేశ్వరరావు, రవిచంద్ర, ఎమ్మెల్యే వెంకటవీరయ్య



మినీ స్టేడియాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ గౌతమ్, ఎంపీలు, ఎమ్మెల్యే



సత్తుపల్లి మండలం గంగారంలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన ఎంపీలు పార్థసారథిరెడ్డి, నామా, రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి/వేంసూరు: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేయించుకున్న సర్వేల్లో ఇరవై సీట్లు కూడా దాటే పరిస్థితి లేదని తేలిన నేపథ్యాన... పేద ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్ పార్టీ పదిలంగా ఉన్నట్లేనని రాష్ట్ర క్రీడలు, టూరిజం, సాంస్కృతిక, యువజన సర్వీస్, ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వేంసూ రు మండలం వెంకటాపురంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు తెలంగాణ ఎలా ఉంది, ఇప్పుడెలా ఉందో ప్రజలు పరిశీలిస్తే అభివృద్ధి అర్థమవుతుందని తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నిబద్ధత కలిగిన నాయకుడని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కాగా, సత్తుపల్లి మండలం గంగారంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించాక మంత్రి మాట్లాడుతూ పాపన్నగౌడ్ గౌడ కులస్తులకే కాక అన్ని వర్గాలను కలుపుకుని రాజు అయిన గొప్ప వీరుడని తెలిపారు. ఆయన మాట్లాడుతూ లండన్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో సర్దార్ పాపన్నగౌడ్ చరిత్ర ఉండగా.. ఛత్రపతి శివాజీ సమకాలికుడైన ఆయన చరిత్రను ఆంధ్రా పాలకులు విస్మరించారని ఆరోపించారు.

ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యం

ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన తన లక్ష్యం వేంసూరు మండలాన్ని అభివృద్ధి చేయటమేనని ఎంపీ బండి పార్థసారధిరెడ్డి అన్నారు. మిషన్ భగీరథ కింద అభివృద్ధి చేసిన తన స్వగ్రామంలోని కందుకూరు నల్లచెరువు మండు వేసవిలోనూ నీళ్లు, చేపలతో కళకళలాడుతుండడం ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకట వీరయ్యను గెలిపించడమే కాక సీఎం కేసీఆర్ మూడో సారి హ్యాట్రిక్ సీఎంగా విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికి ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు నామా నాగేశ్వరరా వు, వద్దిరాజు రవిచంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావుతో పాటు గొర్ల సంజీవరెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, మోర్ల ఏడుకొండలు, బెజవాడ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, పగుట్ల వెంకటేశ్వరరావు, మారోజు సుమలత, దొడ్డా శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, పాల వెంకటరెడ్డి, ఎండీ.ఫైజుద్దీన్, సునీత, మౌనిక, పి.ఝాన్సీరాణి, దాసరి వెంకట్రాం రెడ్డి, మందపాటి వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దేశం చూపు తెలంగాణ వైపు...

కల్లూరు: తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వాన అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని.. అందరి చూపు తెలంగాణ వైపే ఉందని రాష్ట్ర వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కల్లూరులో రూ.3.40 కోట్ల వ్యయంతో నిర్మించిన మినీ స్టేడియంను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి ఫలాలు అందరికి అందుతున్నాయని, పక్క రాష్ట్రాల ప్రజలు కూడా తెలంగాణ వంటి పథకాలు అమలుకావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం క్రీడారంగానికి ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ మినీ స్టేడియానికి మరో రూ.కోటి మంజూరు చేస్తే మిగతా సౌకర్యాలు కల్పించొచ్చని చెప్పారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ కల్లూరులో మినీ స్టేడియం అందుబాటులోకి రావడం ఈ ప్రాంత క్రీడాకారులకు మంచి అవకాశమన్నారు. తొలుత మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యే, కలెక్టర్ షటిల్ ఆడడంతో పాటు జిమ్ ప్రాక్టీస్ చేశారు. డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, పీఆర్ ఈఈ రామచంద్రమౌళి, డీఈ ఆర్.రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ హేమలత, డీఈఓ సోమశేఖర్‌శర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వరరావు, రైతుబంధు సమి తి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావుతో పాటు బీరవల్లి రఘు, కట్టా అజయ్‌కుమార్, చెక్కిలాల మోహనరావు, డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, బోబోలు లక్ష్మణరావు, ఎం.డీ.ఇస్మాయిల్, కాటమనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, పెడకంటి రామకృష్ణ, సీహెచ్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో లారీ క్లీనర్ మృతి

ములకలపల్లి: అనుమానాస్పదస్థితిలో లారీ క్లీనర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... చాపరాలపల్లిలో ధాన్యం లోడు నిమిత్తం లారీతో తాడేపల్లిగూడేనికి చెందిన డ్రైవర్ వన్నెంరెడ్డి వెంకటేశ్వరరావు, క్లీనర్ కొయ్యన రామకృష్ణ (65), గుమస్తా బండి బాబీ శుక్రవారం వచ్చారు. శనివారం ఉదయం కొన్ని ధాన్యం బస్తాలు లోడు చేయగా, వర్షం రావడంలో లారీపై పట్టాలు కప్పి జాగ్రత చేశారు. వర్షం తగ్గాక మిగతా బస్తాలు లోడు చేసేందుకు క్లీనర్ రామకృష్ణ లారీపైకి ఎక్కాడు. ఆ వెంటనే నురుగలు కక్కుకుంటూ కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. ఫిట్స్ వల్ల కానీ, లారీ సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో కానీ రామకృష్ణ మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. లారీ గుమస్తా బాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

ఉద్యోగంలో చేరిన ఏడాదిన్నరకే..

అనారోగ్యంతో సింగరేణి ఉద్యోగి మృతి



శ్రీను (ఫైల్)

ఇల్లెందురూరల్: వయోభారంతో సింగరేణి ఉద్యోగి తన కుమారుడికి వారసత్వ ఉద్యోగం ఇప్పించగా, విధుల్లో చేరిన ఏడాదిన్నరకే కొడుకు మృతి చెందాడు. మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీకి చెందిన కృష్ణమూర్తి సింగరేణి కార్మికుడిగా పనిచేశాడు. వయసు మీదపడటంతో ఆరోగ్యం సహకరించలేదు. దీంతో మెడికల్ ఇన్వాలిడేషన్(అన్‌ఫిట్) కింద కుమారుడు సోలెం శ్రీను (30)కు ఉద్యోగం ఇప్పించాడు. దీంతో ఏడాదిన్నర క్రితం శ్రీను శ్రీరాంపూర్‌లో విధుల్లో చేరాడు. ఇదే సమయంలో కొణిజర్ల మండలానికి చెందిన ఓ యువతితో వివాహం జరిపించారు. వారి కాపురం సవ్యంగా సాగుతున్న క్రమంలో శ్రీను అనారోగ్యం బారిన పడ్డాడు. మూడు నెలలుగా ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటుండగా, పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



మురళి (ఫైల్)

తల్లాడ: తల్లాడ మండలం మిట్టపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సుంకర మురళి (30) ఎన్టీఆర్ జిల్లా సూరారంలో జరిగిన మేనకోడలు ఓనీల ఫంక్షన్‌కు హాజరై తన భార్యతో మోటార్‌సైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలోమిట్టపల్లి వద్ద కారు ఢీకొనడంతో మురళి అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్యకు గాయాలయ్యాయి.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,943

క్లుప్తంగా

ఆనంద్ మోహన్ విడుదలపై సుప్రీంకోర్టుకు ఉమా కృష్ణయ్య

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రాంతానికి చెందిన ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్య హత్య కేసులో దోషి, రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్, బిహార్ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌ను జైలు నుంచి ముందుగానే విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ కృష్ణయ్య భార్య ఉమా కృష్ణయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బిహార్ ప్రభుత్వం జైలు నిబంధనలను మార్చడంతో గురువారం ఆనంద్ మోహన్ సహర్సా జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. 1994 నాటి కృష్ణయ్య హత్య కేసులో గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు ఆనంద్‌మోహన్‌కు జీవిత కాల జైలు పడిందనీ, నిబంధనలను మార్చి ఆ శిక్షను 14 ఏళ్లుగా అన్వయించడం తగదని ఆ పిటిషన్‌లో ఉమా కృష్ణయ్య పేర్కొన్నారు. మరణ శిక్షకు బదులుగా విధించిన జీవిత ఖైదు శిక్షను కోర్టు ఆదేశాల ప్రకారం కచ్చితంగా అమలు చేయాల్సిందేనని, ఇందులో రెమిషన్ ఉండరాదని పేర్కొన్నారు.

బైజూస్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు


కీలక పత్రాలు, డిజిటల్ డేటా స్వాధీనం

న్యూఢిల్లీ: ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా)ను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ ఆఫీసులో, బైజూస్ సంస్థ సీఈఓ రవీంద్రన్ బైజూకు సంబంధించిన భవనంలో సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం రెండు కార్యాలయాలు, ఒక నివాస భవనంలో సోదాలు జరిపామన్నారు. కొన్ని కీలక పత్రాలు, డిజిటల్ డేటాను స్వాధీనం చేసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విచారణకు హాజరు కావాలంటూ పలుమార్లు సమన్లు పంపించినా రవీంద్రన్ బైజు స్పందించలేదని ఈడీ ఆరోపించింది. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ 2011 నుంచి 2023 మధ్య కాలంలో రూ.28 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) పొందినట్లు పేర్కొంది. అలాగే ఈ కంపెనీ ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వివిధ విదేశీ అధికారులకు దాదాపు రూ.9,754 కోట్లను పంపినట్లు ఈడీ ఆరోపించింది. థింక్ అండ్ లెర్న్ సంస్థ 2020–21 నుంచి ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు తయారు చేయడం లేదని, ఖాతాల ఆడిటింగ్ కూడా నిర్వహించడం లేదని ఆరోపించింది. ఇదిలా ఉండగా, ఈడీ సోదాలపై బైజూస్ లీగల్ టీమ్ ప్రతినిధి స్పందించారు. తమ కంపెనీ పూర్తి పారదర్శకంగా పనిచేస్తోందని, అధికారులు అడిగిన సమాచారం అందించామని తెలియజేశారు. ఈ సోదాలు సాధారణంగా జరిగినవేనని పేర్కొన్నారు.

ఒక్కలిగల కంచుకోటలో పాగా ఎవరిదో...!

పాత మైసూరుపై పార్టీలన్నింటి కన్ను
- ఒక్కలిగల ఓట్ల కోసం తీవ్ర యత్నాలు
- జేడీ(ఎస్)కే జై కొడుతూ వస్తున్న ప్రాంతం


పాత మైసూరు. కర్ణాటకలో అధికార పీఠానికి రాచమార్గంగా భావించే ప్రాంతం. మెజారిటీ కావాలంటే ఇక్కడ అత్యధిక స్థానాలు గెలుపొందాల్సిందేనని పార్టీలన్నింటికీ బాగా తెలుసు. ఈ ప్రాంతంలో ఒక్కలిగ సామాజిక వర్గం ప్రభావం అధికం. వారిని ప్రసన్నం చేసుకోగలిగే పార్టీదే పాత మైసూరు. అందుకోసమే పార్టీలన్నీ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి...



సాక్షి బెంగళూరు: కర్ణాటక జనాభాలో ఒక్కలిగ సామాజికవర్గం 15 శాతం ఉంటుందని అంచనా. లింగాయత్ (17 శాతం)ల తర్వాత రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న సామాజికవర్గం వీరే. ఉత్తర కర్ణాటక లింగాయత్ బెల్ట్ కాగా పాత మైసూరు ఒక్కలిగల కంచుకోట. ప్రతి ఎన్నికల్లోనూ ప్రభుత్వ ఏర్పాటులో ఈ వర్గం కీలక పాత్ర పోషిస్తోంది. వీరు కొన్ని దశాబ్దాలుగా ఒక్కలిగలు జేడీ(ఎస్)నే ఆదరిస్తూ వస్తున్నారు. ఈసారి వారిని తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, **బీజేపీలు** తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

ఏడుగురు సీఎంలను ఇచ్చిన ప్రాంతం

- రాష్ట్రంలో మొత్తం 224 అసెంబ్లీ



స్థానాల్లో పాత మైసూరు ప్రాంతంలో 51 సీట్లున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(ఎస్) పార్టీ 24 స్థానాల్లో, కాంగ్రెస్ 16 స్థానాల్లో, బీజేపీ 9 చోట్ల గెలిచాయి.
- కావేరి వివాదం, రైతు ఆత్మహత్యల వంటి సమస్యలు ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్నాయి.
- మేజిక్ నంబర్ సాధించడంలో ఈ ప్రాంతం కీలకం.
- గతంలో ముఖ్యమంత్రులుగా చేసిన 17 మందిలో ఏకంగా ఏడుగురు ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన వారే! ఈ సామాజికవర్గానికి చెందిన హెచ్.డి.దేవెగౌడ ప్రధాని పదవి దాకా ఎదిగారు.
- ఈ ప్రాంతంలో ప్రస్తుతానికి జేడీ(ఎస్) చాలా బలంగా ఉంది.
- మండ్య, హసన్, రామనగర, మైసూరు, చామరాజనగర, కోలార్, తుమకూరు, కొడగు జిల్లాలో ఒక్కలిగలు అధికంగా ఉంటారు.
- ఒక్కలిగల ఓట్లను ఒడిసిపట్టేందుకు అధికార బీజేపీ తాజాగా వారి రిజర్వేషన్లను **4 శాతం** నుంచి 6 శాతానికి పెంచింది.
- **ఇక కాంగ్రెస్** ఒక్కలిగలకు ఎక్కువగా టికెట్లిచ్చి **అదృష్టా**న్ని పరీక్షించుకుంటోంది.
- **జేడీ**(ఎస్) మాత్రం తన సంప్రదాయ ఓటుబ్యాంకు **మళ్లీ** చెక్కుచెదరబోదని ధీమాగా ఉంది.

కాంగ్రెస్.. గత వైభవమే

పాత మైసూరు ప్రాంతంలో కాంగ్రెస్ ఒకప్పుడు తిరుగులేని పార్టీ. దేవెగౌడ రూపంలో బలమైన ఒక్కలిగ నేత రాకతో ఇక్కడ దాని ప్రభ మసకబారింది. ఈ ప్రాంతా**నికే** చెందిన ముఖ్య ఒక్కలిగ నేత పీసీసీ **చీఫ్** డి.కె.శివకుమార్‌పైనే ఈసారి కాం**గ్రెస్ ఆశ**లన్నీ పెట్టుకుంది.

ఇంటిపోరు జేడీ(ఎస్)ను ముంచేనా...?

దేవెగౌడ కుటుంబంలో వారసత్వ రగడ మొదలైంది. ఆయన కుమారుల్లో జేడీ(ఎస్) నేత హెచ్.డి.కుమారస్వామి రామనగర, మైసూరు, మండ్య జిల్లాల్లో గట్టి నాయకుడు కాగా సోదరుడు హెచ్.డి.రేవణ్ణ హాసన్ జిల్లాలో తిరుగులేని నేత. కొద్ది నెలలుగా వీరి మధ్య విభేదాలు పొడచూపాయి. హాసన్ టికెట్ విషయంలో ఇవి రచ్చకెక్కాయి. అక్కడ రేవణ్ణ భార్య భవానీని కాదని అతి సామాన్య కార్యకర్తకు కుమారస్వామి టికెటిచ్చారు. ఈ గొడవ కొంప ముంచుతుందేమోనని జేడీ(ఎస్) వర్గాల్లో ఆందోళన నెలకొంది.

బీజేపీ...

ఇక బీజేపీది భిన్నమైన పరిస్థితి! పాత మైసూరులో పార్టీకి ఒక్కరంటే ఒక్కరు కూడా **బలమైన** ఒక్కలిగ నాయకుడు లేడు. దాంతో **ప్ర**తి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, జేడీ(ఎస్)ల తర్వాతి **స్థా**నానికే పరిమితమవుతూ వస్తోంది. అయితే 2018 **ఎన్నిక**ల్లో కాస్త పుంజుకున్న నేపథ్యంలో ఈసారి భారీ**గానే ఆశ**లు పెట్టుకుంది. గత తప్పిదాలను సరిదిద్దుకుం**టూ బలమైన** స్థానిక నేతలను చేర్చుకుని టికెట్లిచ్చింది.

అన్సారీ సోదరులకు జైలు శిక్ష

బీఎస్పీ నేత అఫ్జల్ అన్సారీపై ఎంపీగా అనర్హత వేటు పడే చాన్స్



ఘజియాబాద్(యూపీ): గ్యాంగ్‌స్టర్ చట్టం కింద 2007లో నమోదైన కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు రాజకీయనేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ, ఆయన సోదరుడు బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీలను దోషిగా తేలుస్తూ వారికి జైలు శిక్ష విధించింది. ముఖ్తార్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా, అఫ్జల్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1 లక్ష జరిమానా విధిస్తూ అదనపు సెషన్స్ న్యాయమూర్తి దుర్గేశ్ తీర్పు చెప్పారని అదనపు జిల్లా ప్రభుత్వ న్యాయవాది(నేర) నీరజ్ శ్రీవాస్తవ చెప్పారు. ఘజియాబాద్ బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ అయిన అఫ్జల్‌ను కేసు విచారణ సందర్భంగా కోర్టులో హాజరుపర్చగా ముఖ్తార్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. తీర్పు తర్వాత అఫ్జల్‌ను పోలీసులు జైలుకు తరలించారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం ఏదైనా కేసులో దోషిగా తేలి ఎంపీకి రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం శిక్ష పడితే ఆ సభ్యుడిని ఎంపీగా అనర్హుడిగా ప్రకటిస్తారు. అఫ్జల్‌కు ఏకంగా నాలుగేళ్ల శిక్ష పడటంతో ఆయన అనర్హత దాదాపు ఖాయమైంది. ప్రజా ప్రతినిధుల చట్టం ప్రకారం దోషులుగా తేలడంతో రాహుల్ గాంధీ(వయనాడ్ స్థానం), ఆజం ఖాన్(రామ్‌పూర్), అతని కుమారుడు అబ్దుల్లా ఆజం(సుఆర్), బీజేపీ నేత విక్రమ్ సైనీ(ఖతౌలీ–ముజఫర్‌నగర్)లు ఇప్పటికే తమ పదవులకు అనర్హులైన విషయం విదితమే. 1997లో వారణాసికి చెందిన వ్యాపారి నంద్‌కిషోర్ అపహరణ, హత్య, 2005లో నాటి ఘాజీపూర్ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్‌ను హత్యచేశారనే ఆరోపణలపై అన్సారీ సోదరులపై 2007 నవంబర్ 22న యూపీలోని కొత్వాలీ పోలీస్‌స్టేషన్‌లో యూపీ గ్యాంగ్‌స్టర్స్ చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో వీరిని గత సెప్టెంబర్‌లో దోషులుగా తేల్చి తీర్పు రిజర్వ్‌చేసి శనివారం వెలువర్చింది. మవూ సదర్ అసెంబ్లీ స్థానం నుంచి అఫ్జల్ గతంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

శతఘ్ని దళంలోకీ మహిళల అడుగు

- మొదటి బ్యాచ్‌లో అయిదుగురిని తీసుకున్న ఆర్మీ
- ముగ్గురికి ఎల్‌ఏసీలో, ఇద్దరికి పాక్ సరిహద్దుల వెంట బాధ్యతలు



న్యూఢిల్లీ: భారత సైన్యం మరో చారిత్రక నిర్ణయం తీసుకుంది. మొట్టమొదటి సారిగా ఆర్టిలరీ రెజిమెంట్‌లోకి అయిదుగురు మహిళా అధికారులను ఎంపిక చేసింది. వీరిలో ముగ్గురికి చైనాతో సరిహద్దుల్లో నియంత్రణ రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి, ఇద్దరికి పాక్ సరిహద్దుల్లోని కీలకమైన ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగించింది. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ(ఓటీఏ)లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న లెఫ్టినెంట్ మెహక్ సైనీ, లెఫ్టినెంట్ సాక్షి దుబే, లెఫ్టినెంట్ అదితి యాదవ్, లెఫ్టినెంట్ పయిస్ ముద్గిల్, లెఫ్టినెంట్ ఆకాంక్షలను ప్రతిష్టాత్మక ఆర్మీ ఆర్టిలరీ విభాగంలోకి ఎంపిక చేసినట్లు శనివారం సైనిక వర్గాలు వెల్లడించాయి. ప్రధాన పోరాట విభాగమైన రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీలో 280 యూనిట్లుంటాయి. ఇందులో బోఫోర్స్ హొవిట్జర్లు, ధనుష్, ఎం–777 హొవిట్జర్లు, కె–9 వజ్ర వంటి శతఘ్ని ఆయుధ వ్యవస్థల నిర్వహణలో పనిచేయాల్సి ఉంటుంది. ఆర్టిలరీలోని అన్ని విభాగాల్లోనూ కొత్త మహిళా అధికారులకు బాధ్యతలు అప్పగిస్తామని, వీరు అత్యంత క్లిష్టతరమైన పరిస్థితుల్లో వివిధ వ్యవస్థల నిర్వహణకు అవసరమైన శిక్షణను పొందుతారని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ అయిదుగురితోపాటు ఓటీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న మరో 19 మంది పురుష అధికారులను తాజాగా వేర్వేరు ప్రాంతాల్లోని ఆర్టిలరీ విభాగాల్లోకి తీసుకున్నట్లు వివరించాయి. మొదటిసారిగా ఆర్మీ 2019లో మహిళలను మిలటరీ పోలీస్ విభాగంలోకి రిక్రూట్ చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో ఆర్మీ కార్ప్స్ ఇంజినీర్స్ విభాగానికి చెందిన కెప్టెన్ శివ చౌహాన్‌కు మొట్టమొదటిసారిగా ప్రపంచంలోని ఎత్తైన యుద్ధక్షేత్రంగా భావించే సియాచిన్ గ్లేసియర్‌లో ఫ్రంట్‌లైన్ బాధ్యతలు అప్పగించారు.

కేజ్రీవాల్ నివాసానికి మరమ్మతులపై నివేదిక కోరిన ఎల్జీ

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికార నివాసానికి రూ.49 కోట్లతో చేయించిన మరమ్మతుల్లో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. దీనిపై సవివర నివేదిక ఇవ్వాలని, మరమ్మతులకు సంబంధించిన అన్ని రికార్డులను 15 రోజుల్లోగా తన ముందుంచాలని శనివారం చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. 2020–22 సంవత్సరాల్లో అధికార నివాసంలో అదనపు పనులు, మరమ్మతుల కోసం కేటాయింపులు రూ43.70 కోట్లు కాగా, రూ.44.78 కోట్లు వెచ్చించినట్లు రికార్డులు చెబుతున్నాయి. సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అవకతవకలు జరిగాయంటూ బీజేపీ ఆరోపణలు చేస్తోందని ఆప్ అంటోంది.

జిల్లా వార్తలు

రామాలయంలో కొనసాగుతున్న ఆడిట్



ఆభరణాల లెక్కలు పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఆడిట్ శనివారం రెండో రోజుకు చేరింది. దేవాదాయ శాఖ జ్యుడీషియల్ వెరిఫికేషన్ అధికారి అంజనీదేవి ఆధ్వర్యాన ఆలయంలోని మ్యూజియంలో ఆభరణాల లెక్కలు సరిచూశారు. అనంతరం బ్యాంకుల్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను పరిశీలించారు. ఆదివారం సైతం ఆడిట్ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుత, మాజీ ఈఓలు ఎల్.రమాదేవి, బి.శివాజీ, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీటి సరఫరా నిలిపివేత

వైరా: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వలకు ఆదివారం నుంచి సాగు అవసరాలకు నీటి సరఫరా నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని జలవనరుల శాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం యాసంగి పంటలు కోతకు వచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే, కుడి, ఎడమ కాల్వల రెగ్యులేటర్లు మరమ్మతు చేయాల్సి ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

సిరిపురం వాసికి అంతర్జాతీయ పర్యావరణవేత్త అవార్డు



డాక్టర్ సూర్యదేవర నాగరాజు

వైరారూరల్: మలేషియా సెలంగోర్‌లోని మహ్సా విశ్వవిద్యాలయంలో యూకే ప్రోగ్రాం లింక్ అడ్మినిస్ట్రేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వైరా మండలం సిరిపురానికి చెందిన డాక్టర్ సూర్యదేవర నాగరాజు ఉత్తమ అంతర్జాతీయ పర్యావరణవేత్త అవార్డుకు ఎంపికయ్యారు. బయోటెక్నాలజీ రంగంలో నాగరాజు చేస్తున్న కృషిని అగ్రికల్చరల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సొసైటీ (ఏఈటీడీఎస్) స్క్రీనింగ్ కమిటీ గుర్తించి అవార్డుకు సిఫారసు చేసింది. జూన్‌లో షేర్–ఏ–కశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయనకు అవార్డు అందజేయనున్నారు. నాగరాజును పలువురు అభినందించారు.

మట్టి దిబ్బలు మిగిల్చి పొట్టకొట్టొద్దు..

- ఓసీ నిర్మాణంతోపాటు అభివృద్ధి చేయండి..
- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో గళమెత్తిన ప్రజలు
- యాజమాన్యం హామీలు అమలుకావడం లేదని ఆవేదన



సమావేశం వేదికపై అదనపు కలెక్టర్ మధుసూదన్, ఏజీఎం రవికుమార్



మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఆందోళనకు దిగిన సీపీఎం నాయకులు

కారేపల్లి: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా పరిధిలో జవహర్ ఖని ఉపరితల బొగ్గు గని (జేకే ఓసీ) ఏర్పాటుకు సిద్ధమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలోని రొంపేడు, సుదిమల్ల, ఖమ్మం జిల్లా సింగరేణి(కారేపల్లి) మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామాల్లో ఈ ఓసీ ఏర్పాటవుతుంది. ఇప్పటికే పర్యావరణ, ఇతర అనుమతులు సాధించిన సంస్థ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈమేరకు ఉసిరికాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శాంతినగర్ ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రవీందర్ నేతృత్వంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరికాయలపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 244, 245, 246, 548లో 284.615 హెక్టార్ల భూమిని ఓసీ ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, ప్రభావిత ప్రాంత ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఓసీ నిర్మాణంతోపాటు అభివృద్ధి చేయాలని, మట్టి దిబ్బలు మిగిల్చి తమ పొట్టకొట్టొద్దని విన్నవించారు.

అభివృద్ధిపై శ్రద్ధ వహించాలి

సింగరేణి బొగ్గు గనులకు పుట్టినిల్లయిన సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలో ఓసీ ఏర్పాటు చేస్తే తమకు అభ్యంతరం లేకున్నా ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని ప్రజాప్రతినిధులు, స్థానికులు డిమాండ్ చేశారు. ఉసిరికాయలపల్లి, పోలంపల్లి, భాగ్యనగర్‌తండా గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, సోలార్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుతో పాటు ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. పెద్ద శబ్దంతో బాంబులు పేల్చే క్రమంలో శబ్దం తీవ్రత ఉండకుండా చూడాలన్నారు. ఇంకా ఓసీ ద్వారా వచ్చే నీటిని సమీప చెరువుల్లోకి తరలించాలని, గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడితే సింగరేణి యాజమాన్యమే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడంతో పాటు మినరల్‌వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేయాలని, నెలకోమారు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, మహిళలు, విద్యార్థులకు ఉపాధి శిక్షణ ఇప్పించాలని కోరారు. కాగా, సింగరేణి యాజమాన్యానికి అనుకూలమైన సంఘాల నేతలకే మాట్లాడే అవకాశం ఇచ్చి తమను విస్మరించడం సరికాదని సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రంనాయక్, కొండబోయిన నాగేశ్వరరావు, కె.నరేందర్ సభావేదిక ఎదుట ఆందోళన చేశారు. దీంతో ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సింగరేణి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు పుష్పాల రామారావు, కిరణ్ కుమార్, వారికి సర్దిచెప్పారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ మధుసూదన్ వారికి మాట్లాడే అవకాశం ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ మేరకు భారీ బందోబస్తు ఏర్పాటుచేయగా, సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలోమ్‌రాజు, పర్యావరణ ఏజీఎం రవికుమార్, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, ఎంపీపీ మాలోతు శకుంతలతో పాటు రావూరి శ్రీనివాసరావు, పగడాల మంజుల, ధరావత్ రామ్మూర్తి నాయక్, ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్, మాలోతు ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

బొగ్గు తవ్వి.. మట్టి దిబ్బలు మిగిల్చి



సింగరేణి యజమాన్యం జేకే–5 ఓసీ ప్రాంతంలో బొగ్గు తవ్వుకుని మట్టి దిబ్బలు మిగిల్చింది. ఇప్పుడు సన్నకారు రైతుల నుంచి భూమి సేకరించి పరిహారం ఇవ్వలేదు. బ్లాస్టింగ్‌తో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి. ఇలాంటి అంశాలపై జాగ్రత్తలు తీసుకోవడమే కాక అభివృద్ధికి నిధులు సక్రమంగా వెచ్చించాలి.

–గుమ్మడి నర్సయ్య, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే

ఓసీ నీళ్లను చెరువులకు మళ్లించాలి..



ఓసీ ద్వారా వచ్చే నీళ్లను సమీప ప్రాంతాల్లోని చెరువులకు పైపులైన్ల ద్వారా మళ్లించాలి. ఆరేళ్ల కిందట వేసిన పైపులైన్లు పగిలిపోయాయి. వీటి బదులుగా కొత్త పైపులైన్ వేసి నీరు వృథా కాకుండా చూడాలి. అలాగే, సీఎస్‌ఆర్ నిధులను కచ్చితంగా ఓసీ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులకే కేటాయించాలి.

–వాంకుడోతు జగన్, జెడ్పీటీసీ సభ్యుడు


సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



ఉసిరికాయలపల్లిలో సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. అలాగే, సోలార్ ప్రాజెక్టు వద్ద రహదారి వెంట ప్రయాణికులకు షెడ్డు నిర్మించాలి. కోటమైసమ్మ తల్లి ఆర్చీ నుంచి సీతారాంపురం వరకు డబుల్ రోడ్డు నిర్మించి గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. విద్యార్థులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలి.

–బానోతు బన్సీలాల్, ఉసిరికాయలపల్లి సర్పంచ్

బ్లాస్టింగ్ ప్రభావం తగ్గించాలి



ఓసీకి సమీపాన ఆలియా తండా గ్రామం ఉంటుంది. గనిలో చేపట్టే పేలుళ్లతో మా ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి. రాత్రివేళ చిన్నపిల్లలు భయపడుతున్నారు. అందువల్ల బ్లాస్టింగ్ సామర్థ్యాన్ని పూర్తిగా తగ్గించాలి. మా గ్రామంలో సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసి తాగు నీరు సరఫరా చేయాలి.

–ధరావత్ రాంజీ, ఆలియా తండా గ్రామం

జేఈఈ మెయిన్స్‌లో గిరిజన గురుకుల విద్యార్థుల ప్రతిభ



భూక్యా బాలాజీ జె.బాలాజీ ప్రవీణ్

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కాలేజీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో సత్తా చాటారు. వివరాలను ప్రిన్సిపాల్ బాలస్వామి శనివారం వెల్లడించారు. కాలేజీకి చెందిన భూక్యా బాలాజీ 97.65 పర్సంటైల్‌తో రాష్ట్ర స్థాయిలో 172వ ర్యాంక్ సాధించగా, జె.బాలాజీ 94.8 పర్సంటైల్‌తో 469, తేజావత్ ప్రవీణ్ 92.09 శాతంతో 863 ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే, 70 శాతానికి పైగా పర్సంటైల్ తొమ్మిది మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. కాలేజీ నుంచి 37 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ –2కు హాజరుకాగా 31 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

అభినందించిన ఐటీడీఏ పీఓ

భద్రాచలం: జేఈఈ మెయిన్స్‌లో రాణించిన గిరిజన విద్యార్థులను భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు అభినందించారు. జేఈఈ ఫలితాల్లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని ఆయన కొనియాడారు. ఖమ్మం ఎస్‌ఓఈ కళాశాలలో చదువుతున్న బాలాజీ 97.65 పర్సంటైల్ సాధించడం అభినందనీయమన్నారు. గత ఏడాది 98 మంది ర్యాంకులు సాధించగా, ఈ ఏడాది 119 మందికి ర్యాంకులు వచ్చాయని పీఓ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష



సత్తుపల్లిలోని కేంద్రం వద్ద విద్యార్థులు



మధిరలోని కేంద్రంలో సమీక్షిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రబాబు

కూసుమంచి/సత్తుపల్లిటౌన్: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యాసంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశాలకు శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 4,308 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,733 మంది హాజరయ్యారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ చంద్రబాబు మధిర, తదితర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఇక సత్తుపల్లి పాతసెంటర్ హైస్కూల్, ప్రభుత్వ బాలుర హైస్కూళ్లలోని కేంద్రాల్లో 472 మంది విద్యార్థులకు గాను 415 మంది హాజరయ్యారని పీఎస్‌లు యాకోబు, నాగేశ్వరరావు, స్వామి తెలిపారు.

కొత్తగూడెం జిల్లాలో

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు రూరల్: జిల్లాలో నవోదయ ప్రవేశ పరీక్ష కోసం తొమ్మిది కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాల్లో 1,952 మంది విద్యార్థులకు గాను 1,696 మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఇక ఇల్లెందులోని రెండు కేంద్రాల్లో 715మందికి గాను 626 మంది హాజరయ్యారని హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, లాలు తెలిపారు.

కాశీనగరం ప్రజల ఇంటి కల సాకారం..



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: మండలంలోని ఎస్.కాశీనగరం గ్రామ ప్రజల ఇంటి కల సాకారమైంది. హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యాన గ్రామంలో 74 రేకుల ఇళ్లు (కుటుంబానికి ఒక గది) నిర్మించి ప్రజలకు అందించారు. ఈ మేరకు శనివారం గ్రామంలో గృహ ప్రవేశాలు ఏర్పాటుచేయగా జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో పేదలు, గోదావరి వరద ముంపు బాధితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం అభినందనీయమన్నారు. తద్వారా కాశీనగరం వాసుల సొంతింటి కల నెరవేరిందని చెప్పారు. నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ సీఈఓ మయూర్, డైరెక్టర్ అబ్దుల్, సర్పంచ్ దుర్గతో పాటు గడ్డం సతీశ్, డాక్టర్ గడ్డం ఆదాము, యలమంచి శ్రీనుబాబు, వేమన వెంకటేశ్వర్లు, చింతం సులోమాన్, నాగరాజు, అజయ్ పాల్గొన్నారు.